సాక్షి నల్లగొండ

శుక్రవారం : 11 : జూలై : 2025



పర్యాటక కేంద్రంగా బుద్ధవనం

ప్రపంచ పర్యాటక కేంద్రంగా బుద్ధవనం అభివృద్ధి చెందుతుందని మాజీ మంత్రి కుందూరు జానారెడ్డి అన్నారు. - 8లో



పర్యావరణాన్ని పరిరక్షించాలి

ప్రతిఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలని ఎంజీయూ వీసీ ఖాజా అల్తాఫ్ హుస్సేన్ అన్నారు. - 8లో

సాగర్ సమాచారం



పూర్తిస్థాయి నీటి మట్టం : 590 అడుగులు

ప్రస్తుత నీటి మట్టం	:	541.20 అడుగులు
ఇన్‌ఫ్లో	:	1,16,833 క్యూసెక్కులు
అవుట్ ఫ్లో	:	8,906 క్యూసెక్కులు
విద్యుదుత్పాదన కేంద్రం ద్వారా	:	4,204
కుడికాల్వ ద్వారా	:	నిల్
ఎడమకాల్వ ద్వారా	:	3,202 క్యూసెక్కులు
ఏఎమ్మార్పీకి	:	1,500 క్యూసెక్కులు
వరద కాల్వకు	:	నిల్

న్యూస్‌రీల్

సోలార్ ప్లాంట్‌ల ఏర్పాటుతో లాభాలు

నల్లగొండ అగ్రికల్చర్ : వ్యవసాయ భూముల్లో సోలార్ ప్లాంట్‌లను ఏర్పాటుతో రైతులు లాభాలు పొందవచ్చని తెలంగాణ ఇంధన వనరుల అభివృద్ధి సంస్థ జిల్లా మేనేజర్ ఎం.పాండురంగారావు అన్నారు. గురువారం నల్లగొండలో నాచురల్ పవర్ ఏసియా ప్రైవేట్ లిమిటెంట్ సంస్థ ఆధ్వర్యంలో రైతులకు సోలార్ ప్లాంట్‌ల ఏర్పాటుపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. సోలార్ ప్లాంట్‌ల ద్వారా ఉత్పత్తి అయ్యే విద్యుత్‌ను విద్యుత్ సంస్థలకు అమ్ముకోవచ్చన్నారు. నాచురల్ పవర్ ఏసియా సంస్థ ఎండీ కె.శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ ప్లాంట్‌ల ఏర్పాటు, పెట్టుబడి రైతులకు వచ్చే ఆదాయంపై వివరంగా తెలియజేశారు. ఈ సదస్సులో విద్యుత్ సంస్థ డీఈ కృష్ణారావు, ఏఇ నవీద్ అహ్మద్, ఎస్‌బీహెచ్ అధికారి హరికృష్ణ రైతులు పాల్గొన్నారు.

బీసీ అభివృద్ధి ఇన్‌చార్జి అధికారిగా రాజ్‌కుమార్



నల్లగొండ : జిల్లా వెనకబడిన తరగతుల అభివృద్ధి ఇన్‌చార్జిగా అధికారిగా గృహనిర్మాణ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్ రాజ్‌కుమార్‌కు బాధ్యతలు అప్పగించారు. ఇప్పటివరకు ఇక్కడ ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్న అలీమొద్దీన్‌ను నాగర్‌కర్నూల్ అధికారిగా పనిచేస్తున్నారు. అయితే ఆయన రెండు జిల్లాలో పనిచేయడం ఇబ్బందిగా ఉండడంతో జిల్లా కలెక్టర్ రాజ్‌కుమార్‌కు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు.

మహిళల ఆర్థిక బలోపేతానికి కృషి



దామరచర్లలో మాట్లాడుతున్న డీఆర్‌డీఓ శేఖర్‌రెడ్డి

మిర్యాలగూడ : మహిళలను ఆర్థికంగా బలోపేతానికి తెలంగాణ ప్రభుత్వం రుణాలు అందిస్తూ ఎంతగానో కృషిచేస్తోందని డీఆర్‌డీఓ వై.శేఖర్‌రెడ్డి అన్నారు. ఇందిరా మహిళా శక్తి సంబురాల్లో భాగంగా గురువారం దామరచర్ల గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కళాజాతాలో ఆయన మాట్లాడారు. మహిళలు తయారు చేసిన ఉత్పత్తులకు మార్కెటింగ్ సౌకర్యం, డ్వాక్రా బజార్లు మొదలైన కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో ఏపీఎం గుంటి దిలీప్‌కుమార్, సీపీలు శంకర్, శ్రీనివాస్, మాధవి, అనూష, కవిత, వీఓఏలు సంజీవరెడ్డి, నాగలక్ష్మీ, సీతామహాలక్ష్మి, నాగమణి, శ్రీదేవి, శాంతమ్మ, నాగలక్ష్మీ, కళాజాత సభ్యులు బచ్చలకూరి శ్రీను, నాగేష్ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు ఎరువులు అందుబాటులో ఉంచాలి



త్రిపురారంలో ఫర్టిలైజర్ షాపులో రికార్డులు పరిశీలిస్తున్న జేడీఏ శ్రవణ్ కుమార్

త్రిపురారం : రైతులకు ఎరువులు అందుబాటులో ఉంచాలని, అధిక దరలకు విక్రయిస్తే కేసులు నమోదు చేసి లైసెన్సులు రద్దు చేస్తామని జేడీఏ శ్రవణ్ కుమార్ అన్నారు. గురువారం త్రిపురారం మండల కేంద్రంలో ఫర్టిలైజర్ దుకాణాను తనిఖీ చేసి మాట్లాడారు. రైతులు యూరియా వాడకాన్ని తగ్గించుకోవాలన్నారు. శాస్త్రవేత్తలు, అధికారుల సూచనలు పాటించాలన్నారు. ఆయన వెంట త్రిపురారం ఏఓ పార్వతి చౌహాన్, సిబ్బంది, డీలర్లు ఉన్నారు.

నవోదయలో ప్రవేశానికి దరఖాస్తులు

నల్లగొండ : జవహర్ నవోదయ విదాయలయాల్లో 6వ తరగతిలో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవాలని జిల్లా విద్యా శాఖ అధికారి భిక్షపతి గురువారం ఒక ప్రకటనలలో తెలిపారు. ప్రవేశ పరీక్ష డిసెంబర్ 13న జరుగుతుందని, ఈనెల 29లో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. అన్ని పాఠశాలలు, కాంప్లెక్స్ హెడ్‌మాస్టర్లు తమ పాఠశాలల పిల్లలు దరఖాస్తు చేసుకునేలా సహకరించాలని కోరారు.

ఆగస్టు 3 నుంచి టీటీసీ పరీక్షలు


టెక్నికల్ టీచర్ కోర్సు (టీటీసీ) వేసవి శిక్షణ శిబిరాలు పూర్తిచేసిన వారికి ఆగస్టు 3వ తేదీ నుంచి లోయర్ గ్రేడ్ పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని జిల్లా విద్యాశాఖ అధికారి భిక్షపతి ఒక ప్రకటనలో తెలిపారు. వివరాలకు తమ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

యువతరం.. అంతరం

జనాభా 1961 తరువాత పెరిగినా, ప్రస్తుతం తగ్గుతోంది

- సంతాన పరిమితితో తగ్గుతున్న జనాభా శాతం
- ఉమ్మడి జిల్లాలో 1991 తరువాత నుంచి క్రమంగా తగ్గుదల
- 2011 నాటికి క్షీణించిన జనాభా పెరుగుదల రేటు
- మరో 20 ఏళ్లలో యువత కంటే సీనియర్ సిటిజన్ల సంఖ్యే ఎక్కువకానుంది

నేడు ప్రపంచ జనాభా దినోత్సవం



సాక్షి ప్రతినిధి, నల్లగొండ :

ఉమ్మడి జిల్లాలో యువతరం తగ్గిపోతోంది. పెరుగుతున్న పోషణ భారం.. సంతాన పరిమితికి కారణమవుతోంది. 1951లో మొదటిసారిగా జనాభా లెక్కలు చేసిన తరువాత పదేళ్లపాటు పెద్దగా జనాభా పెరుగకపోయినా, ఆ తరువాత 30 ఏళ్ల పాటు అంటే 1971 వరకు జిల్లాలో జనాభా గణనీయంగా పెరిగింది. మళ్లీ 1991 తరువాత నుంచి జనాభా సంఖ్యా పరంగా పెరిగినా, అంతకుముందు సంవత్సరాలతో పోల్చుకుంటే పెరుగుదల రేటు మాత్రం క్రమంగా క్షీణిస్తోంది. దీంతో వచ్చే 20 ఏళ్లలో సీనియర్ సిటిజన్ల సంఖ్యే ఎక్కువగా ఉండనుంది. ఈ నేపథ్యంలో ఒకరిద్దరు కాదు ముగ్గురు, అంత కంటే ఎక్కువ మంది పిల్లలను కనాలన్న సూచనలు వస్తున్నాయి. అయితే ప్రస్తుతం పెరిగిన జీవన ప్రమాణాలు, వస్తున్న ఆదాయానికి, చేయాల్సిన వ్యయానికి పొంతన లేకపోవడం, తక్కువ ఆదాయం, ఎక్కువ ఖ ర్చుల కారణంగా పరిమిత సంతానికే నేటి యువత మొగ్గుచూపుతోంది. తక్కువ మందిని కని సక్రమంగా పెంచి, అన్నీ సమకూర్చగలిగితే చాలు అన్నట్లుగా భావిస్తోంది. సంపన్న వర్గాల నుంచి పేద, మధ్య తరగతి వరకు చిన్న కుటుంబాలకే మొగ్గు చూపుతున్నారు. ఫలితంగా జనాభా పెరుగుదల ఏటేటా తగ్గిపోతోంది.

ఒకప్పుడు బలవంతంగా కుటుంబ నియంత్రణ

ఒకప్పుడు జనాభా పెరుగుదలను నియంత్రించేందుకు ప్రభుత్వమే ఒక్కరు ముద్దు, ఇద్దరు హద్దు అన్న నినాదాన్ని ప్రజల్లోకి తెచ్చింది. అయితే అదే నినాదం ఇప్పటికీ అమలవుతూనే ఉంది. 1970 తరువాత భారత ప్రభుత్వం దేశంలో జనాభా ఎక్కువ అవుతుందని, ఆహార పదార్థాల కొరత ఏర్పడుతుందన్న ఆలోచనతో కుటుంబ నియంత్రణను అమల్లోకి తెచ్చింది. బలవంతంగా కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేపట్టింది.

రెట్టింపునకు మించి పెరిగిన జనాభా

ఉమ్మడి జిల్లాలో 1951లో చేపట్టిన జనాభా లెక్కల ప్రకారం ఉన్న జనాభా కంటే ఇప్పుడు జనాభా రెండు రెట్లు పెరిగే అవకాశం ఉంటుందని అధికారులు అంచనా వేస్తున్నారు. అప్పట్లో ఉమ్మడి నల్లగొండ జిల్లాలో జనాభా 15,43,975 ఉండగా, 2011 సంవత్సరం నాటికే అది 34,88,809కు పెరిగింది. ఈ 15 ఏళ్లలో మరో 5 లక్షలకు పైగా పెరిగి ఉంటుందని భావిస్తున్నారు. సంఖ్యాపరంగా పెరిగినా.. పెరుగుదల రేటు మాత్రం క్షీణిస్తోంది. 1951 నుంచి 1961 వరకు 1.97 శాతమే పెరిగింది. ఆ తరువాత పదేళ్లలో 1971 నాటికి 13.45 శాతం పెరిగింది. 1981 నాటికి 20.18 శాతం, 1991 నాటికి 20.07 శాతం జనాభా పెరిగింది. ఇక తరువాత పెరుగుదల రేటు క్షీణిస్తూ వస్తోంది. తరువాత పదేళ్లకు అంటే 2001 నాటికి పెరుగదల రేటు 12.19 శాతానికి పడిపోయింది. 2011 నాటికి జనాభా పెరుగుదల రేటు 6.91 శాతానికి తగ్గింది.

ఉమ్మడి జిల్లాలో ప్రతి పదేళ్లకు జనాభా పెరుగుదల ఇలా..

సంవత్సరం	జనాభా	పెరుగుదల	వృద్ధి శాతం
1951	15,43,975	--	--
1961	15,74,946	37,971	1.97
1971	18,19,738	2,44,792	13.45
1981	22,79,681	4,59,947	20.18
1991	28,52,092	5,72,407	20.07
2001	32,47,982	2,95,890	12.19
2011	34,88,809	2,40,827	6.91

ఉమ్మడి కుటుంబాలు లేక..

అప్పట్లో జనాభా పెరుగుదలను తగ్గించేందుకు తీసుకువచ్చిన కుటుంబ నియంత్రణను ఇప్పటి దంపతులు పక్కాగా అమలు చేస్తున్నారు. ఒక్కరిద్దరితోనే సరిపెట్టుకుంటున్నారు. పెరుగుతున్న జీవన వ్యయంతో ఒకరిద్దరు పిల్లలను కనేందుకు నేటి యువత మొగ్గు చూపుతోంది. మరోవైపు ప్రస్తుతం ఉమ్మడి కుటుంబాలు కనుమరుగవుతున్నాయి. ఒకప్పుడు పుట్టిన బిడ్డను చూసుకునేందుకు ఉమ్మడి కుటుంబంలో నానమ్మ, తాతయ్య, పెద్దనాన్నలు, పెద్దమ్మలు, చిన్నాన్నలు, చిన్నమ్మలు, అత్తమ్మలు ఇలా చాలా మంది ఉండేవారు. కానీ ఇప్పుడు బతుకు పోరులో ఉమ్మడి కుటుంబాలు తగ్గిపోయాయి.

రోజుకు సగటున 70 జననాలు

నల్లగొండ జిల్లాలో ప్రతి రోజు సగటున 70 మంది జన్మిస్తున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ గణాంకాలు చెపుతున్నాయి. ప్రభుత్వ ఆస్పత్రులలో 40 మంది, ప్రైవేటు ఆస్పత్రులలో 30 మంది జన్మిస్తున్నారు.



LN IS $1 అనిల్& f దంపతు, $


రామగిరి(నల్లగొండ): ఈ దంపతులు నల్లగొండ పట్టణానికి చెందిన అనిల్–సహజ. వీరికి 2020లో వివాహం కాగా ప్రస్తుతం ఐదేళ్ల పాప (ఆరాధ్య) ఉంది. ఇంకో సంతానంతో సరిపెట్టుకోవాలని ఆశ పడుతున్నారు. అధిక సంతానం వల్ల కుటుంబ ఆర్థికాభివృద్ధికి ఆటంకం కలుగుతుందని, చిన్న కుటుంబంతోనే లైఫ్ హ్యాపీగా ఉంటుందనుకుంటున్నారు. సంతానం తక్కువగా ఉంటే తల్లితండ్రులు పిల్లలతో ఎక్కువ సమయం గడపడం సులభం అవుతుందని వీరి భావన. ఆర్థికంగా, మానసికంగా ఒత్తిడి లేకుండా ప్రశాంతంగా జీవితాన్ని గడపవచ్చంటున్నారు. పిల్లలకు మెరుగైన విద్యను అందించవచ్చు. తద్వారా ఉద్యోగపరంగా అనుకున్న లక్ష్యాన్ని చేరుకునేలా చేయవచ్చని అంటున్నారు. తద్వారా దేశ అభివృద్ధిలో భాగస్వాములు కావచ్చు. దేశంలో ఉన్న వనరులకు అనుగుణంగా ప్రతి ఒక్కరూ జనాభా నియంత్రణకు పాటు పడితే బాగుటుంది. అధిక సంతానంతో కుటుంబాలకు భారం కాకూడదంటున్నారు.

ఇద్దరికంటే ఎక్కువ వద్దంటున్న వారే అధికం..


ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా యువత అభిప్రాయాలను తెలుసుకునేందుకు గురువారం 'సాక్షి' సర్వే నిర్వహించింది. వివాహమైన యువజంటలతో పాటు 25 ఏళ్లకు పైబడి వివాహ ప్రయత్నాల్లో ఉన్న వారిని పలకరించి ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 120 శాంపిల్స్ సేకరించింది. ఇద్దరికంటే ఎక్కువ సంతానం అవసరం లేదని 60 శాతం మంది, పెరిగిపోతున్న ఖర్చులతో పోషణ భారం అవుతుందని 56.67 శాతం మంది వెల్లడించారు. అంతేకాదు పరిమిత సంతానంపై ముందుగానే నిర్ణయం తీసుకుంటామని 50 శాతం మంది వివరించారు. ఇద్దరి కంటే ఎక్కువ కంటామని 20 శాతం మంది చెబితే.. ఆలోచిస్తామని మరో 20శాతం వెల్లడించారు. ఎక్కువ మందిని కంటే పర్యవేక్షణ సరిగ్గా ఉండదని, సరైన ప్రేమ చూపలేమని 35 శాతం మంది, జనాభా పెరుగుదల దేశానికి ముప్పని 8.3 శాతం మంది వెల్లడించారు. ఇక 21.67 శాతం మంది.. పెద్దలు ఎలా చెబితే అలా నడుచుకుంటామని వివరించారు.

ఉమ్మడి జిల్లాలో 120 మందితో సర్వే నిర్వహించగా, వారు వెల్లడించిన అభిప్రాయాలివే..


1. ఇద్దరి కంటే ఎక్కువ మంది పిల్లలను కనేందుకు ఇష్టపడతారా?



2. ముగ్గురు పిల్లలను కనడాన్ని ఎందుకు వద్దనుకుంటున్నారు?



3 'పరిమిత సంతానం'పై ముందే నిర్ణయం తీసుకుంటారా?



రామన్నపేట మండలం ఇంద్రపాలనగరం గ్రామానికి చెందిన గోటూరి పాండురంగయ్యశాస్త్రి కుటుంబం నాలుగుతరాలుగా ఉమ్మడిగా జీవిస్తోంది. పాండురంగయ్య శాస్త్రి ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా 1994లో రిటైర్ అయ్యాడు. భార్య విమల గృహిణి. వీరికి నలుగురు కుమారులు, ఒక కుమార్తె సునంద ఉన్నారు. అందరూ ఉన్నత విద్యనభ్యసించారు. పెద్ద కుమారుడు పౌరోహితం, రెండు, మూడో కుమారులు వ్యవసాయం, నాలుగో కుమారుడు ఫార్మా కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. అందరికీ వివాహమైంది. వీరికి ముగ్గురు కుమారులు, ఎనిమిది మంది కుమార్తెలు. వారిలో కొందరి పెళ్లిళ్లు అయ్యాయి. ఇప్పటికీ కుటుంబసభ్యులందరూ తల్లితండ్రుల మాట జవదాటరు. అతా కలిసే ఉంటున్నారు.



గోటూరి పాండురంగయ్యశాస్త్రి కుటుంబం

టీబీ రహిత జిల్లాగా మారుద్దాం



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

- కలెక్టర్ ఇలా త్రిపాఠి

మిర్యాలగూడ : జిల్లాను టీబీ రహితంగా మార్చేందుకు సవాలుగా తీసుకోవాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. జిల్లా వైద్యారోగ్యశాఖ ఆధ్వర్యంలో గురువారం మిర్యాలగూడలోని మిర్యాలగూడ రైస్ మిల్లర్స్ అసోసియేషన్ భవనంలో టీబీ ముక్త్ భారత్ అభియాన్‌పై ఏర్పాటు చేసిన సమావేశానికి ఆమె హాజరై మాట్లాడారు. వైద్యారోగ్యశాఖలో పనిచేస్తున్న డాక్టర్లు, సిబ్బంది, ఏఎన్ఎం, ఆశా కార్యకర్తలు గుర్తింపు వచ్చేలా విధులు నిర్వహించాలన్నారు. మిర్యాలగూడ ప్రాంతంలో రైస్ మిల్లులు అధికంగా ఉండడం వల్ల దుమ్ముధూలితో ప్రజలకు టీబీ వచ్చే అవకాశం ఎక్కువగా ఉన్నందున రెండు వారాలకు మించి దగ్గు ఉండే వారిని గుర్తించి పరీక్షలు చేయాలన్నారు. నల్లగొండ, మిర్యాలగూడ రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ల తరపున రూ.20లక్షల విలువ చేసే ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ ఎక్స్‌రే మిషన్‌ను వైద్యారోగ్యశాఖకు ఇవ్వడంతో సంఘం ప్రతినిధులను అభినందించారు. కార్యక్రమంలో సబ్ కలెక్టర్ నారాయణ్ అమిత్, అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్, టీబీ నియంత్రణ అధికారి కల్యాణ్‌చక్రవర్తి, డీఎంహెచ్‌ఓ పుట్ల శ్రీనివాస్, జిల్లా ఆసుపత్రుల సమన్వయ అధికారి డాక్టర్ మాతృనాయక్, డిప్యూటీ డీఎంహెచ్‌ఓలు వేణుగోపాల్‌రెడ్డి, రవి, పౌర సరఫరాల జిల్లా మేనేజర్ హరీష్, డీఎస్‌ఓ వెంకటేశ్వర్లు, రైస్ మిల్లర్స్ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కర్నాటి రమేష్, మిర్యాలగూడ రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు గౌరు శ్రీనివాస్, సంఘం కార్యదర్శి బాబి పాల్గొన్నారు.

ఎమ్మార్పీకే యూరియా అమ్మాలి

మిర్యాలగూడ : ఎమ్మార్పీకే యూరియా అమ్మాలని, అధిక రేట్లకు విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని కలెక్టర్ ఇలా త్రిపాఠి హెచ్చరించారు. మిర్యాలగూడ శివారులోని అవంతి వేర్ హౌసింగ్ ఫర్టిలైజర్స్ గోదాంను గురువారం కలెక్టర్ తనిఖీ చేసి మాట్లాడారు. ఆమె వెంట సబ్ కలెక్టర్ నారాయణ్‌అమిత్, డీఏఓ శ్రవణ్‌కుమార్, ఇన్‌చార్జి ఏడీఏ సైదానాయక్, మార్క్‌ఫెడ్ డీఎం ఎన్.జ్యోతి ఉన్నారు.



ఎరువుల స్టాక్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్

ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

నల్లగొండ : అడ్మినిస్ట్రేషన్ ఆఫ్ జస్టిస్‌పై ఉచిత శిక్షణ పొందేందుకు లా గ్రాడ్యుయేషన్ పూర్తిచేసిన బీసీ అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా బీసీ అభివృద్ధి ఇన్‌చార్జి అధికారి రాజ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. వయస్సు 24 నుంచి 35 సంవత్సరాలకు లోబడి, వార్షికాదాయం గ్రామీణ ప్రాంతాల వారికి రూ.1.50 లక్షలు, పట్టణ వాసులకు రూ.2 లక్షలు మించరాదని పేర్కొన్నారు. శిక్షణ కాలంలో నెలకు రూ.వెయ్యి ఉపకార వేతనం, అడ్వకేట్‌గా ఎన్‌రోల్‌మెంట్‌కు ఫీజు రూ.585, లా పుస్తకాలు, ఫర్నిచర్ కొనుగోలుకు రూ.3వేలు చెల్లించబడుతాయని తెలిపారు. దరఖాస్తులు నల్లగొండలోని తమ కార్యాలయంలో ఈనెల 15 నుంచి పొంది 31లోగా అందజేయాలని పేర్కొన్నారు. పూర్తిచేసిన దరఖాస్తుతో పాటు అభ్యర్థి పాస్‌ఫొటో, ఆధార్ కార్డు, స్థానిక, కుల ఆదాయ ధ్రువీకరణ, లా డిగ్రీ, డిగ్రీ ప్రొవిజినల్, కన్సాలిడేట్ ధ్రువీకరణ జిరాక్స్ పత్రాలు సమర్పించాలని కోరారు.

దర్వేశిపురం ఆలయ హుండీ లెక్కింపు

కనగల్: మండలంలోని దర్వేశిపురం రేణుక ఎల్లమ్మ ఆలయ హుండీలను గురువారం దేవాదాయ శాఖ అధికారుల సమక్షంలో లెక్కించారు. 111 రోజులకు గాను రూ. 21.62 లక్షల ఆదాయం సమకూరిందని దేవాదాయ శాఖ డివిజనల్ ఇన్‌స్పెక్టర్ బి.సుమతి తెలిపారు. హుండీ లెక్కింపులో ఆలయ చైర్మన్ చీదేటి వెంకట్‌రెడ్డి, ఈఓ అంబటి నాగిరెడ్డి, కార్యదర్శి డి.పద్మ, ఏఎస్‌ఏఐ వెంకటయ్య, ధర్మకర్తలు ఎం.రాజు, కె.నరేష్, ఎం.రమేష్, ఆర్.వెంకన్న, కె.ప్రభాకర్, కె.శంకర్‌రెడ్డి, ఆలయ సిబ్బంది సాయి సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

జయజయ సాయి



గురుపౌర్ణమి సందర్భంగా గురువారం నల్లగొండలోని శివాజీనగర్‌లో గల ఆలయంలో సాయిబాబాకు పాలాభిషేకం చేస్తున్న యువతి

ప్రమోషన్లలో బీసీలకు అన్యాయం



మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు కుమారస్వామి

నల్లగొండ : తెలంగాణ విద్యుత్ సంస్థల్లో ప్రమోషన్లలో బీసీ ఉద్యోగులకు తీవ్ర అన్యాయం జరుగుతుందని బీసీ విద్యుత్ ఉద్యోగుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కోడెపాక కుమారస్వామి అన్నారు. గురువారం నల్లగొండలోని విద్యుత్ శాఖ అతిథి గృహంలో జరిగిన తెలంగాణ బీసీ విద్యుత్ ఉద్యోగుల సంక్షేమ సంఘం జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రం ఏర్పడిన తర్వాత విద్యుత్ ఉద్యోగులకు ఇచ్చిన ప్రమోషన్లను సమీక్షించాలన్నారు. దీనిపై హైకోర్టు, సుప్రీంకోర్టు తీర్పులు ఉన్నాయని, 2019లోనే రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చినా విద్యుత్ సంస్థల్లో అమలు చేయలేదన్నారు. గతంలో ఎన్నడూలేని విధంగా విద్యుత్ సంస్థల్లో అడ్‌హాక్ పేరుతో ప్రమోషన్లు ఇస్తున్నారని, కేంద్ర ప్రభుత్వం నిబంధనల ప్రకారం ఇది తప్పు అని అన్నారు. అత్యవసర పరిస్థితుల్లో మాత్రమే అడ్‌హాక్ ప్రమోషన్లు ఇవ్వాలన్నారు. సుప్రీం, హైకోర్టు తీర్పులు, ప్రభుత్వ ఆదేశాల మేరకు తక్షణమే ప్రమోషన్లను సమీక్షించాలని డిమాండ్ చేశారు. సంఘం జిల్లా అధ్యక్షుడు గంజి వెంకన్న అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ముత్యం వెంకన్న గౌడ్, వర్కింగ్ ప్రెసిడెంట్ బ్రహ్మేందర్ రావు, ట్రాన్స్‌కో అధ్యక్షుడు అశోక్ కుమార్, మారం శ్రీనివాస్, పి.యాదగిరి, పి.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

3 నెలల్లో 43.63 లక్షల పనిదినాలు

లక్ష్యం మించిన 'ఉపాధి'

- సంవత్సరమంతా చేయాల్సిన పనులు త్రైమాసికంలోనే పూర్తి
- 5.53 లక్షల పనిదినాలను అధికంగా చేసిన కూలీలు



నల్లగొండ : ఉపాధి హామీ పథకం కింద జిల్లాకు కేటాయించిన పనిదినాలను కూలీలు మూడు నెలల్లోనే పూర్తి చేశారు. కేంద్ర ప్రభుత్వం ఈ ఆర్థిక సంవత్సరం అంటే 2025 ఏప్రిల్ నుంచి 2026 మార్చి వరకు ఉపాధి కూలీలకు 38.10 లక్షల పని దినాలను టార్గెట్ నిర్ణయించింది. కానీ.. ఈ ఆర్థిక సంవత్సరం ప్రారంభమైన మూడు నెలల్లోనే 43.63 లక్షల పని దినాలను కూలీలు పూర్తి చేశారు. అంటే లక్ష్యాన్ని మించి 5.53 లక్షల పనిదినాలను అధికంగా చేపట్టారు. రూ.126.94 కోట్ల విలువైన పనులు చేయాల్సి ఉండగా.. ఇప్పటికే రూ.122.84 కోట్ల పనులు పూర్తి చేశారు. 133 కుటుంబాలకు వంద రోజుల పనులు పూర్తయ్యాయి. ప్రభుత్వం ఇచ్చిన లక్ష్యం ప్రకారం కూలీలకు డబ్బుల చెల్లింపు ప్రక్రియ కొనసాగుతోంది. అధికంగా చేసిన పని దినాలకు చెల్లింపుల కోసం అధికారులు ప్రతిపాదనలు పెట్టారు.

కూలి కూడా అధికంగానే గిట్టుబాటు..

వాస్తవంగా ప్రభుత్వం కూలీలకు రోజుకు రూ.307 కూలి చెల్లించాల్సి ఉంటుంది. గత సంవత్సరంలో రోజుకు రూ.197 మాత్రమే చెల్లించారు. ఈ సంవత్సరం కూలీలకు రూ.276.13 చొప్పున గిట్టుబాటు అయ్యింది.

పని దినాల పొడిగింపుపై రాని స్పష్టత..

ఉపాధి హామీలో ఈ సారి ప్రభుత్వం పని దినాలను కుదించింది. దీంతో మూడు నెలల్లో పూర్తయ్యాయి. పని దినాల పొడిగింపుపై కేంద్రం నుంచి ఎలాంటి స్పష్టత రాలేదు. అయితే రాష్ట్ర కోటా 6.5 కోట్ల పనిదినాలు ఉండగా.. ఇప్పటి వరకు 5 కోట్ల పైచిలుకు పూర్తయ్యాయి. మిగిలిన పనులు కూడా ఏ జిల్లాల్లో లక్ష్యానికి మించి పూర్తిచేశారో.. ఆ ప్రాంతాలకు ఆ పని దినాలను పెంచే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. అయితే ప్రస్తుతం కూలీలు వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు. డిసెంబర్, జనవరి ఆ తర్వాతనే కూలీలు మళ్లీ పనులకు వస్తారు. అయితే ఆర్థిక సంవత్సరం ఇంకా 9 నెలలు ఉంది. కేంద్రం ఈ విషయంలో స్పందించి పని దినాలు పెంచుతూ ఉత్తర్వులు జారీ చేస్తే తప్ప ఈ ఆర్థిక సంవత్సరంలో ఉపాధి పనులు చేపట్టే అవకాశం లేదు.

పని దినాల పెంపుపై ఆదేశాలు రాలేదు



జిల్లాలో ఈ ఆర్థిక సంవత్సరం కేటాయించిన పని దినాల కంటే అధికంగా పని చేశారు. ఇప్పటికే పని దినాలు పూర్తయినందున మళ్లీ పని దినాలు పెంచుతూ నిర్ణయం తీసుకుంటే తిరిగి కూలీలకు పనులు కల్పిస్తాం. దీనిపై ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆదేశాలు రాలేదు.

–శేఖర్‌రెడ్డి, డీఆర్‌డీఓ

క్లుప్తంగా

విద్యుదాఘాతంతో రైతు మృతి

పెన్‌పహాడ్‌: వ్యవసాయ పొలం వద్ద ట్రాన్స్‌ఫార్మర్‌ ఆన్‌ చేస్తుండగా విద్యుదాఘాతానికి గురై రైతు మృతిచెందాడు. ఈ ఘటన పెన్‌పహాడ్‌ మండలం నాగులపాటి అన్నారం గ్రామంలో గురువారం జరిగింది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. నాగులపాటి అన్నారం గ్రామానికి చెందిన దొంతగాని నాగయ్య(45) తన వ్యవసాయ పొలం వద్ద ట్రాన్స్‌ఫార్మర్‌ ఆన్‌ చేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై కిందపడిపోయాడు. చుట్టుపక్కల రైతులు గమనించి అతడిని చికిత్స నిమిత్తం 108 వాహనంలో సూర్యాపేట ఏరియా ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

అనారోగ్య సమస్యలతో కిరాణ వ్యాపారి ఆత్మహత్య


నర్సయ్య (ఫైల్‌)

మోత్కూరు: అనారోగ్య సమస్యలతో కిరాణ వ్యాపారి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన మోత్కూరు మున్సిపల్‌ కేంద్రంలో గురువారం తెల్లవారుజామున జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మోత్కూరు పట్టణంలోని కొత్త బస్టాండ్‌కు ఎదురుగా గల పద్మశ్రీ కిరాణ దుకాణం యజమాని దోర్నాల నర్సయ్య(54) గురువారం తెల్లవారుజామున తాను నివాసముంటున్న భవనం పైకి వెళ్లి రూములో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ప్రతిరోజు వాకింగ్‌కు వెళ్లే నర్సయ్య భవనం పైకి వెళ్లి ఎంతసేపటికీ తిరిగి కిందకు రాకపోవడంతో కుటుంబ సభ్యులు వెళ్లి చూడగా ఆయన ఉరికి వేలాడుతూ కనిపించాడు. మృతుడికి ఇద్దరు కుమారులు ఉన్నారు. అనారోగ్య సమస్యలతోనే నర్సయ్య ఆత్మహత్య చేసుకున్నాడని అతడి భార్య పోలీసులు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొంది. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

కల్తీ పాలు తయారుచేస్తున్న వ్యక్తిపై కేసు

భువనగిరి: కల్తీ పాలు తయారుచేస్తున్న వ్యక్తిపై భువనగిరి రూరల్‌ పోలీసులు కేసు నమోదు చేశారు. భువనగిరి మండలం మన్నెవారిపంపు గ్రామంలో ఓ వ్యక్తి కల్తీ పాలు తయారుచేసి హైదరాబాద్‌కు తరలించి విక్రయిస్తున్నట్లు అందిన సమాచారం మేరకు పోలీసులు దాడి చేసి అతడి వద్ద 80లీటర్ల కల్తీ పాలు, ఐదు కిలోల మిల్క్‌ పౌడర్‌, 500 మిల్లీలీటర్ల హైడ్రోజన్‌ పెరాక్సైడ్‌, 400 మిల్లీలీటర్ల ఎసిటిక్‌ యాసిడ్‌ స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు భువనగిరి రూరల్‌ ఎస్‌హెచ్‌ఓ అనిల్‌కుమార్‌ తెలిపారు.

మూడేళ్లు కష్టపడితే 30 ఏళ్లు ఆదాయం

ఆలేరురూరల్‌: ఆయిల్‌పామ్‌ సాగుతో అధిక ప్రయోజనాలు ఉంటాయని, మూడేళ్లు కష్టపడితే 30 ఏళ్ల పాటు ఆదాయం లభిస్తుందని రాష్ట్ర ఆయిల్‌ఫెడ్‌ కార్పొరేషన్‌ చైర్మన్‌ జంగా రాఘవరెడ్డి, ప్రభుత్వ విప్‌ బీర్ల ఐలయ్య పేర్కొన్నారు. గురువారం ఆలేరు మండలం కొలనుపాకలో రైతులు నర్రా నారాయణరెడ్డి, సీతారాంరెడ్డి వ్యవసాయ క్షేత్రంలో ఆయిల్‌పామ్‌ మెగా ప్లాంటేషన్‌ కార్యక్రమానికి వారు హాజరై కలెక్టర్‌ హనుమంతరావుతో కలిసి ఆయిల్‌పామ్‌ మొక్కలు నాటారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఎకరాకు రూ.2లక్షల వరకు ఆదాయం పొందవచ్చన్నారు. ఆయిల్‌పామ్‌ సాగు చేసిన రైతులకు ప్రభుత్వం అనేక ప్రోత్సాహకాలు అందజేస్తున్నారు. సూక్ష్మ సేద్య పరికరాలను ఎస్సీ, ఎస్టీలకు 100 శాతం, బీసీలకు 90 శాతం, ఓసీ రైతులకు 80 శాతం రాయితీపై ఇస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జనగాం ఉపేందర్‌రెడ్డి, మదర్‌ డైయిరీ చైర్మన్‌ మధుసూదన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచ పర్యాటక కేంద్రంగా బుద్ధవనం

- మాజీ మంత్రి కుందూరు జానారెడ్డి


బుద్ధుడి పాదాల వద్ద పుష్పాంజలి ఘటిస్తున్న జానారెడ్డి, ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి, బాలీవుడ్‌ హీరో గగన్‌మాలిక్‌ తదితరులు

నాగార్జునసాగర్‌: ప్రపంచ పర్యాటక కేంద్రంగా బుద్ధవనం అభివృద్ధి చెందుతుందని మాజీ మంత్రి కుందూరు జానారెడ్డి అన్నారు. నాగార్జునసాగర్‌లోని బుద్ధవనంలో గురువారం ధర్మచక్ర పరివర్తన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మాజీ మంత్రి కుందూరు జానారెడ్డి, నాగార్జునసాగర్‌ ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డి, ఎమ్మెల్సీ శంకర్‌నాయక్‌, బుద్ధవనం ప్రత్యేకాధికారి మల్లేపల్లి లక్ష్మయ్య, బాలీవుడ్‌ నటుడు గగన్‌ మాలిక్‌, వరల్డ్‌ బ్యాంక్‌ కన్సల్టెంట్‌ రవి బంకర్‌ తదితరులు హాజరై బుద్ధవనంలో బుద్ధుడి పాదాల వద్ద పుష్పాంజలి ఘటించారు. అనంతరం ఐపీఎస్‌ అధికారి చారుసిన్హా బహూకరించిన బోధి మొక్కను బుద్ధవనంలోని ధ్యాన మందిరంలో నాటారు. ఆ తర్వాత మహాస్తూపంలోని ధ్యాన మందిరంలో బుద్ధ జ్యోతిని వెలిగించి బౌద్ధ సంప్రదాయం ప్రకారం చాటింగ్‌(ప్రార్థన) చేశారు. అనంతరం మహాస్తూపంలోని సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జానారెడ్డి మాట్లాడుతూ.. సిద్దార్థుడు గౌతమ బుద్ధుడిగా మారిన తర్వాత ఆషాడ పౌర్ణమి రోజున తన శిష్యులకు మొదటి ఉపన్యాసం ఇచ్చిన రోజును పురస్కరించుకొని ధర్మచక్ర పరివర్తన దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా గౌతమ బుద్ధుడి గొప్పతనాన్ని ఆయన గుర్తుచేసుకున్నారు. అనంతరంర ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి మాట్లాడుతూ.. బుద్ధవనాన్ని నాగార్జునసాగర్‌లో ఏర్పాటు చేయడానికి జానారెడ్డి కృషే కారణమని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో బుద్ధవనాన్ని అభివృద్ధి చేస్తామని చెప్పారు. బాలీవుడ్‌ నటుడు గగన్‌మాలిక్‌ మాట్లాడుతూ.. బ్రాండ్‌ అంబాసిడర్‌గా ప్రపంచ దేశాల్లోని బౌద్ధ కేంద్రాలతో బుద్ధవనాన్ని సమన్వయం చేయడానికి తన వంతు కృషి చేస్తానని పేర్కొన్నారు. అనంతరం వారు సాగర్‌ జలాశయం మధ్యలో ఉన్న చాకలిగట్టును, నాగార్జునకొండను సందర్శించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ మాజీ వైస్‌ చైర్మన్‌ కర్నాటి లింగారెడ్డి, బుద్ధవనం ఎగ్జిక్యూటివ్‌ అధికారి శాసన, ఎస్టేట్‌ అధికారి రవిచంద్ర, ఆర్ట్‌ మరియు ప్రమోషన్స్‌ మేనేజర్‌ శ్యాంసుందర్‌రావు, ఇంజనీర్లు శ్రీనివాస్‌రెడ్డి, నజీష్‌, దైవజ్ఞశర్మ, సాగర్‌ సీఐ శ్రీనునాయక్‌, హాలియా ఏఎంసీ చైర్మన్‌ తుమ్మలపల్లి శేఖర్‌రెడ్డి, జిల్లా నాయకులు మల్గిరెడ్డి లింగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికల్లో 25శాతం రిజర్వేషన్‌కు కృషి


బైక్‌ ర్యాలీలో పాల్గొన్న శివచరణ్‌రెడ్డి, సర్వోత్తమ్‌రెడ్డి, వేణారెడ్డి, యువజన కాంగ్రెస్‌ నాయకులు

- యువజన కాంగ్రెస్‌ రాష్ట్ర అధ్యక్షుడు జక్కిడి శివచరణ్‌రెడ్డి

సూర్యాపేట: యూత్‌ కాంగ్రెస్‌ నేతలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో 25శాతం రిజర్వేషన్‌ కల్పించేలా అధిష్టానం దృష్టికి తీసుకెళ్తామని యువజన కాంగ్రెస్‌ రాష్ట్ర అధ్యక్షుడు జక్కిడి శివచరణ్‌రెడ్డి అన్నారు. గురువారం సూర్యాపేట జిల్లా కాంగ్రెస్‌ పార్టీ కార్యాలయంలో యువజన కాంగ్రెస్‌ జిల్లా విస్తృతస్థాయి సమావేశానికి శివచరణ్‌రెడ్డితో పాటు ఏఐసీసీ సభ్యుడు రాంరెడ్డి సర్వోత్తమ్‌రెడ్డి, సూర్యాపేట వ్యవసాయ మార్కెట్‌ కమిటీ చైర్మన్‌ కొప్పుల వేణారెడ్డి ముఖ్యఅతిథులుగా హాజరై మాట్లాడారు. తెలంగాణలో కాంగ్రెస్‌ ప్రభుత్వం ఏర్పాటు కావడంలో యూత్‌ కాంగ్రెస్‌ పాత్ర మరువలేనిదని అన్నారు. దేశంలో మోదీ ప్రభుత్వానికి యువత త్వరలో చరమగీతం పాడి రాహుల్‌ గాంధీని ప్రధానమంత్రిని చేయడం ఖాయమన్నారు. బీజేపీ, బీఆర్‌ఎస్‌ పార్టీలపై గత పది సంవత్సరాలుగా యూత్‌కాంగ్రెస్‌ నిర్వహించిన పోరాటాల స్ఫూర్తితో నేడు కాంగ్రెస్‌ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను క్షేత్రస్థాయిలో తీసుకెళ్లేందుకు కృషి చేయాలన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రతి కాంగ్రెస్‌ పార్టీ అభ్యర్థి భారీ మెజార్టీతో విజయం సాధించేలా యువజన కాంగ్రెస్‌ పూర్తి బాధ్యత తీసుకోవాలన్నారు. కాంగ్రెస్‌ పార్టీలో కష్టపడిన ప్రతి ఒక్కరికి తగిన సమయంలో తప్పకుండా గుర్తింపు లభిస్తుందన్నారు. ఐవైసీ యాప్‌ను సద్వినియోగం చేసుకోవాలన్నారు. అంతకుముందు జిల్లా కేంద్రంలో భారీ బైక్‌ ర్యాలీ నిర్వహించారు. యూత్‌ కాంగ్రెస్‌ జిల్లా అధ్యక్షుడు ఎలిమినేటి అభినయ్‌ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో యూత్‌ కాంగ్రెస్‌ రాష్ట్ర కార్యదర్శి కొమ్ము జవహర్‌, రాష్ట్ర జనరల్‌ సెక్రటరీ మాధవరెడ్డి, గుర్ర శ్యాంచరణ్‌ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షురాలు శ్రావ్యరెడ్డి, అంబేద్కర్‌, నవీన్‌చారి, పట్టణ అధ్యక్షుడు అంజత్‌ అలీ, మాజీ కౌన్సిలర్లు బైరు శైలేందర్‌, బాలుగౌడ్‌ రవి, రెబల్‌ శ్రీను, చేడే అంబేద్కర్‌, విజయభాస్కర్‌, ఏజాజ్‌, కుమార్‌, జావిద్‌, కోరు కొప్పుల నరేష్‌, అజీం, కుక్కడపు మహేష్‌, పట్టణ అధ్యక్షుడు బొడ్డు సాయి తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలి

- ఎంజీయూ వీసీ ఖాజా అల్తాఫ్‌ హుస్సేన్‌


మొక్కలు నాటుతున్న వీసీ అల్తాఫ్‌ హుస్సేన్‌, విద్యార్థులు

నల్లగొండ టూటౌన్‌: ప్రతిఒక్కరూ తమ వంతు బాధ్యతగా మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలని మహాత్మాగాంధీ యూనివర్సిటీ(ఎంజీయూ) వైస్‌ చాన్స్‌లర్‌ ఖాజా అల్తాఫ్‌ హుస్సేన్‌ అన్నారు. నల్లగొండలోని ఎంజీయూలో గురువారం నిర్వహించిన వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా ఎన్‌ఎస్‌ఎస్‌ యూనిట్‌, యూనివర్సిటీ కాలేజీ ఆఫ్‌ కామర్స్‌ అండ్‌ బిజినెస్‌ మేనేజ్‌మెంట్‌ విభాగం ఆధ్వర్యంలో విద్యార్థులతో కలిసి వీసీ మొక్కలు నాటారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో అటవీ విస్తీర్ణం తక్కువగా ఉందని, దీంతో సరైన సమయంలో వర్షాలు కరవడం లేదన్నారు. కొత్తగా మొక్కలు పెంచే బాధ్యత తీసుకోకపోవడం వలన క్రమంగా చెట్ల సంఖ్య తగ్గిపోతుందన్నారు. భవిష్యత్తు తరాలకు కాలుష్యం లేని వాతావరణం అందించాలంటే మొక్కలు పెంచే బాధ్యత ప్రతిఒక్కరూ తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్‌ అలువాల రవి, ఎన్‌ఎస్‌ఎస్‌ కోఆర్డినేటర్‌ మద్దిలేటి, ప్రొఫెసర్‌ ఆకుల రవి, ప్రిన్సిపాల్‌ శ్రీదేవి, నీలకంఠం, శేఖర్‌ పాల్గొన్నారు.

సాగర్‌లో విద్యుదుత్పాదన ప్రారంభం

నాగార్జునసాగర్‌: ఎగువ నుంచి నాగార్జునసాగర్‌ ప్రాజెక్టుకు వరద నీరు వస్తుండడంతో గురువారం ప్రధాన విద్యుత్‌ ఉత్పాదన కేంద్రంలో అధికారులు విద్యుదుత్పాదన ప్రారంభించారు. ఎగువ నుంచి వరద వస్తుండడంతో విద్యుత్‌ ఉత్పాదన నిరంతరాయంగా కొనసాగే అవకాశం ఉంది. ఈ నీరంతా దిగువన టెయిల్‌పాండ్‌కు చేరుకుని.. అక్కడి నుంచి పులిచింతల ప్రాజెక్టుకు చేరుతుంది. గత ఏడాది కంటే ముందుగానే ఈ ఏడాది ముందుగానే అధికారులు విద్యుత్‌ ఉత్పాదనను ప్రారంభించారు.

విద్యుదుత్పాదన కేంద్రాలను సందర్శించిన హైడల్‌ డైరెక్టర్‌


జల విద్యుత్‌ కేంద్రంలో అధికారులతో మాట్లాడుతున్న హైడల్‌ డైరెక్టర్‌ బాలరాజు

నాగార్జునసాగర్‌: నాగార్జునసాగర్‌లోని జల విద్యుత్‌ ఉత్పాదన కేంద్రాలను టీజీ జెన్‌కో హైడల్‌ డైరెక్టర్‌ బాలరాజు గురువారం సందర్శించారు. ఎడమ కాల్వపై ఉన్న జల విద్యుత్‌ కేంద్రంలో శుక్రవారం నుంచి విద్యుత్‌ ఉత్పాదన ప్రారంభిస్తున్న నేపథ్యంలో రెండు టర్బైన్‌ల స్థితిగతులను ఆయన పరిశీలించారు. అనంతరం ప్రధాన జల విద్యుత్‌ కేంద్రంలో రూ.7.5 కోట్లతో మరమ్మతులు జరుగుతున్న మొదటి టర్బైన్‌ను పరిశీలించారు. ఈ నెల 31వ తేదీ నాటికి మరమ్మతులు పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అంతకుముందు ఆయనకు జల విద్యుత్‌ కేంద్రం సీఈ మంగేష్‌నాయక్‌ పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు.

ఎర్రవెల్లి ఫాంహౌస్‌లో చర్చకు సిద్ధమా..

- భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి

సాక్షి, యాదాద్రి: ఎర్రవెల్లి ఫాంహౌస్‌లో మాక్‌ అసెంబ్లీ పెట్టి ప్రజా సమస్యలు చర్చించేందుకు సిద్ధమని సీఎం రేవంత్‌రెడ్డి విసిరిన సవాల్‌ను కేసీఆర్‌ స్వీకరించాలని భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి డిమాండ్‌ చేశారు. కేటీఆర్‌.. కేవలం ఎమ్మెల్యే మాత్రమేనని, సీఎంతో చర్చించే అర్హత ఆయనకు లేదన్నారు. గురువారం భువనగిరిలో ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డితో కలిసి అభివృద్ధి పనులకు ఎంపీ శంకుస్థాపన చేశారు. అనంతరం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎంపీ విలేకరులతో మాట్లాడారు. సీఎంను ఛాలెంజ్‌ చేయాలనుకుంటే ప్రతిపక్ష నాయకుడు కేసీఆర్‌ చేయాలని, లేదంటే ఆ పదవిని కేటీఆర్‌ తెచ్చుకుని సవాల్‌ చేయాలన్నారు. బీఆర్‌ఎస్‌ కుట్రలను కాంగ్రెస్‌ నాయకులు, కార్యకర్తలు తిప్పికొట్టాలన్నారు. బీఆర్‌ఎస్‌ పార్టీ మళ్లీ ఆంధ్రా, తెలంగాణ సెంటిమెంట్‌ను తెరమీదకు తెచ్చే కుట్ర చేస్తుందన్నారు. రూ.లక్షల కోట్లు పెట్టి నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టు వల్ల ఉత్తర తెలంగాణకు తప్ప దక్షిణ తెలంగాణకు ఒరిగిందేమీ లేదన్నారు. కాంగ్రెస్‌ అధికారంలోకి వచ్చిన వెంటనే కృష్ణా నదిలో 280 టీఎంసీలను వాడుకున్నామన్నారు. బీఆర్‌ఎస్‌ పదేళ్ల పాలనలో 10 టీఎంసీలు కూడా వాడుకోలేదని ఆరోపించారు. తెలంగాణ మొదటి సీఎం కేసీఆర్‌ మొదటి అపెక్స్‌ కమిటీ సమావేశంలోనే.. మనకు రావలసిన నీళ్లపై కొట్లాడకుండా రాయలసీమకు నీళ్లిచ్చాడని ఆరోపించారు. గతంలో కాంగ్రెస్‌ హయాంలో చేపట్టిన ఎస్‌ఎల్‌బీసీ, పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టులను పూర్తిచేస్తే కమీషన్లు రావని, బీఆర్‌ఎస్‌ ప్రభుత్వం కాళేశ్వరం ప్రాజెక్టును చేపట్టిందన్నారు. ఈ విలేకరుల సమావేశంలో భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి, పీసీసీ ప్రతినిధులు తంగెళ్లపల్లి రవికుమార్‌, పోత్నక్‌ ప్రమోద్‌కుమార్‌ పాల్గొన్నారు.

స్వర్ణగిరిలో తిరుప్పావడ సేవ


తిరుప్పావడ సేవ నిర్వహిస్తున్న అర్చకులు

భువనగిరి: భువనగిరి పట్టణ శివారులోని స్వర్ణగిరి క్షేత్రంలో వేంకటేశ్వర స్వామికి గురువారం స్వామి తిరుప్పావడ సేవ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా 450 కిలోల అన్నప్రసాదం, లడ్డు, వడ వంటి పిండి వంటలను స్వామివారికి నైవేద్యంగా సమర్పించారు. అంతకుముందు ఉదయం స్వామివారికి సుప్రభాత సేవ, తోమాల సేవ, సహస్రనామార్చన సేవ, నిత్య కల్యాణం జరిపించారు. మధ్యాహ్నం 3వేల మంది భక్తులకు అన్నదానం చేశారు. సాయంత్రం తిరువీధి ఉత్సవ సేవ, కర్పూర మంగళహారతులు సమర్పించారు. గురుపూర్ణిమ సందర్భంగా ఆలయంలో రామానుజచార్యులకు ఆరాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో ఆలయ అర్చకులు, భక్తులుపాల్గొన్నారు.

బైక్‌ను ఢీకొట్టిన లారీ.. ఒకరు మృతి


వెంకన్న (ఫైల్‌)

కేతేపల్లి: విజయవాడ-హైదరాబాద్‌ జాతీయ రహదారిపై కేతేపల్లి మండల పరిధిలోని కొర్లపహాడ్‌ వద్ద గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతిచెందాడు. స్థానిక పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నకిరేకల్‌ మండల పరిధిలోని చందుపట్ల గ్రామ పంచాయతీకి చెందిన జిల్లా వెంకన్న(46) సుతారి పనిచేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. గురవారం పని నిమిత్తం బైక్‌పై కేతేపల్లి మండల పరిధిలోని కొర్లపహాడ్‌కు వచ్చిన వెంకన్న స్థానికంగా ఉన్న జంక్షన్‌ వద్ద హైవే దాటుతుండగా హైదరాబాద్‌ నుంచి విజయవాడ వైపు వెళ్తున్న లారీ బైక్‌ను ఢీకొట్టింది. ఈ ఘటనలో లారీ బైక్‌తో పాటు వెంకన్నను దాదాపు వంద మీటర్ల దూరం వరకు ఈడ్చుకెళ్లింది. దీంతో వెంకన్న శరీర భాగాలు నుజ్జునుజ్జు అయ్యి అక్కడికక్కడే మృతిచెందాడు. సమాచారం అందుకున్న కేతేపల్లి పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నకిరేకల్‌ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడి భార్య రాణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసకుని దర్యాప్తు చేస్తున్నట్లు కేతేపల్లి ఎస్‌ఐ సతీష్‌ తెలిపారు.

యాదగిరిగుట్ట సర్కిళ్లలో విగ్రహాల ఏర్పాటుపై సమీక్ష


రింగ్‌ రోడ్డు సర్కిల్‌లో అధికారులు, స్థపతులతో చర్చిస్తున్న ఈఓ వెంకట్రావ్‌

యాదగిరిగుట్ట: యాదగిరి లక్ష్మీనరసింహస్వామి కొండ దిగువన రింగ్‌లో రోడ్డులోని సర్కిళ్లలో దేవుళ్ల విగ్రహాల ఏర్పాటుపై ఈఓ వెంకట్రావ్‌ ఆలయ అధికారులు, స్థపతులతో గురువారం సమీక్ష సమావేశం నిర్వహించారు. అనంతరం రింగ్‌ రోడ్డు చుట్టూ ఉన్న నాలుగు సర్కిళ్లను పరిశీలించి, ఏ సర్కిల్‌లో ఏ విగ్రహం ఏర్పాటు చేయాలని చర్చించారు. ఇటీవల నాలుగు సర్కిళ్లలో యాదరుషి, శ్రీ అభయ ఆంజనేయస్వామి, ప్రహ్లాద, గరుడ దేవుళ్ల పేర్లతో నామకరణం చేశారు. ఆగమ శాస్త్ర ప్రకారం సర్కిళ్లలో విగ్రహాలను ఏర్పాటు చేయనున్నట్లు ఈఓ వెంకట్రావ్‌ వెల్లడించారు. ఆయా కార్యక్రమాల్లో డిప్యూటీ ఈఓ భాస్కర్‌శర్మ, ఆలయాధికారులు దయాకర్‌రెడ్డి, రఘు, స్థపతులు పాల్గొన్నారు.

వీవర్స్‌ సర్వీస్‌ సెంటర్‌కు జాతీయ అవార్డు


అరుణ్‌కుమార్‌, రీజినల్‌ హెడ్‌ ఆఫీసర్‌

భూదాన్‌పోచంపల్లి: దక్షిణ భారతదేశ రీజియన్‌ పరిధిలో హైదరాబాద్‌లోని వీవర్స్‌ సర్వీస్‌ సెంటర్‌కు గురువారం కేంద్ర జౌళి మంత్రిత్వశాఖ 2024-25 సంవత్సరానికి గాను స్కీమాటిక్‌ ఇంటర్‌వెన్షన్స్‌, ప్రొడక్ట్‌ అండ్‌ డిజైన్‌ డెవలప్‌మెంట్‌ జాతీయ అవార్డు ప్రకటించింది. ఆగస్టు 7న జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకొని ఢిల్లీలోని భారత్‌ మండపంలో జరిగే కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపదిముర్ము అవార్డు అందజేయనున్నారు. ఈ సందర్భంగా హ్యాండ్లూమ్‌ డెవలప్‌మెంట్‌ రీజినల్‌ హెడ్‌ ఆఫీసర్‌ ఎస్‌.అరుణ్‌కుమార్‌ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న 30 రకాల స్కీమ్‌లను క్షేత్రస్థాయిలో విజయవంతంగా అమలు చేయడంతో పాటు నూతన చేనేత డిజైన్ల అభివృద్ధికి కృషి చేసినందుకు దేశంలోనే ఉత్తమ వీవర్స్‌ సర్వీస్‌సెంటర్‌తో పాటు ఉత్తమ అధికారిగా అవార్డు వచ్చిందని తెలిపారు. తెలంగాణలో ఆధునిక టెక్నాలజీతో కూడిన 118 ఎలక్ట్రానిక్‌ జకాట్‌ మిషన్లు అందజేసి, నూతన డిజైన్లలో శిక్షణ ఇచ్చామని తెలిపారు. వంద శాతం సబ్సిడీతో 450 మగ్గాలు, 115 వర్క్‌షెడ్‌లు, 198 ఆసుమిషన్లు అందజేశామని పేర్కొన్నారు. 630 సమర్థ్‌ శిక్షణ తరగతులను నిర్వహించామని చెప్పారు. అంతరించిపోతున్న గద్వాల్‌ ఒర్జినల్‌ చీరలతో పాటు కాకతీయుల కాలం నాటి ఆర్మూర్‌ చీరలను నేయిస్తున్నామని తెలిపారు. హైదరాబాద్‌ వీవర్స్‌ సర్వీస్‌సెంటర్‌ అందిస్తున్న సేవలను గుర్తించి దేశంలోనే హైదరాబాద్‌, చెన్నై వీవర్స్‌ సర్వీస్‌సెంటర్‌లు అవార్డుకు ఎంపికయ్యాయని తెలిపారు.

బ్యాంకును మోసగించిన వ్యక్తులపై కేసు నమోదు

చౌటుప్పల్‌: బ్యాంకు నుంచి రుణం తీసుకుని మోసానికి పాల్పడిన వ్యక్తులపై గురువారం చౌటుప్పల్‌ పోలీసులు కేసు నమోదు చేశారు. చౌటుప్పల్‌ సీఐ మన్మథకుమార్‌ తెలిపిన వివరాల ప్రకారం.. చౌటుప్పల్‌ పట్టణ కేంద్రంలోని ప్రియాంక డయాగ్నోస్టిక్‌ సెంటర్‌ యజమానితో పాటు మరో నలుగురు వ్యక్తులు అయిన మామిడి శివరాణి, గుండారపు శివశంకర్‌, మణికంఠ మెడికల్‌ స్టోర్‌, ఎంఆర్‌ఐ యంత్రం సరఫరాదారుడైన డాక్టర్‌ సూర్యప్రకాష్‌ గ్యారంటీర్లుగా ఉండి ఎంఆర్‌ఐ యంత్రం కొనుగోలు చేసేందుకుగాను గతేడాది హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్‌ బ్యాంకు నుంచి రూ.2.97కోట్ల రుణం తీసుకున్నారు. అప్పటి నుంచి తీసుకున్న రుణానికి వాయిదాలు చెల్లించడం లేదు. దీంతో రుణం ఇచ్చిన బ్యాంకు అధికారులు ఆరా తీయగా అసలు ఎంఆర్‌ఐ యంత్రమే డెలివరీ కాలేదన్న విషయాన్ని గుర్తించారు. దీంతో బ్యాంకు సీనియర్‌ మేనేజర్‌ జ్ఞాన నందుకుమార్‌ గురువారం చౌటుప్పల్‌ పోలీసులను ఆశ్రయించారు. ఆయన ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

నకిలీ డాక్టర్‌పై..

చింతపల్లి: చింతపల్లి మండలం మాల్‌ వెంకటేశ్వర నగర్‌లో నకిలీ వైద్యుడిగా చలామణి అవుతున్న వ్యక్తిపై తెలంగాణ మెడికల్‌ కౌన్సిల్‌ ఫిర్యాదు మేరకు స్థానిక పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మాల్‌ వెంకటేశ్వరనగర్‌లోని పద్మావతి ఆస్పత్రిలో గత నెల 12న తెలంగాణ మెడికల్‌ కౌన్సిల్‌ సభ్యుడు డాక్టర్‌ దండెం లాలయ్య కుమార్‌, విజిలెన్స్‌ అధికారి మేకల రాకేష్‌ కలిసి తనిఖీలు చేశారు. ఈ ఆస్పత్రిలో బుస్సా రమేష్‌కుమార్‌ అనే వ్యక్తి ఎంబీబీఎస్‌ చదవకున్నా వైద్యుడిగా చలామణి అవుతున్నాడని వారు గుర్తించారు. అతడిని విచారించగా.. ఎంసీఐ స్క్రీనింగ్‌లో ఉత్తీర్ణుడయ్యానని, ఎంబీబీఎస్‌ పూర్తిచేశానని తెలంగాణ మెడికల్‌ కౌన్సిల్‌లో నమోదు చేసుకున్నానని తెలిపాడు. దీంతో పదిరోజుల లోపు అన్ని పత్రాలను మెడికల్‌ కౌన్సిల్‌కు సమర్పించాలని తనిఖీ బృందం రమేష్‌కుమార్‌ను ఆదేశించారు. కానీ అతడు ఎలాంటి పత్రాలు సమర్పించలేదు. అంతేకాకుండా ఆస్పత్రి బోర్డుపై ఎంబీబీఎస్‌, ఎండీ, జనరల్‌ ఫిజీషియన్‌ అని రాసుకుని రోగులకు చికిత్స అందిస్తున్నట్లు గుర్తించారు. బుస్సా రమేష్‌కుమార్‌ ఎంబీబీఎస్‌ సర్టిఫికెట్‌ నకిలీదని నిర్ధారణ కావడంతో మెడికల్‌ కౌన్సిల్‌ ఫిర్యాదు మేరకు అతడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ ముత్యాల రామ్మూర్తి తెలిపారు.

ఆటో బోల్తా.. ఇద్దరికి గాయాలు

చిట్యాల: విజయవాడ-హైదరాబాద్‌ జాతీయ రహదారిపై చిట్యాల పట్టణ శివారులో గురువారం గాజు అద్దాల లోడుతో వెళ్తున్న ఆటో బోల్తా పడడంతో ఇద్దరికి గాయాలయ్యాయి. వివరాలు.. హైదరాబాద్‌ నుంచి నార్కట్‌పల్లి వైపు గాజు అద్దాల లోడుతో వెళ్తున్న ట్రాలీ ఆటో చిట్యాల పట్టణ శివారులోకి రాగానే విజయవాడ-హైదరాబాద్‌ జాతీయ రహదారిపై బోల్తా పడింది. హైవేపై గాజు అద్దాలు ముక్కలుముక్కలుగా పగిలిపోయాయి. దీంతో రహదారిపై కాసేపు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడడంతో వాహనాలు నిలిచిపోయాయి. హైవే అధికారులు ఘటనా స్థలానికి చేరుకుని పగిలిపోయిన గాజు అద్దాలతో పాటు ట్రాలీ ఆటోను జేసీబీ సహాయంతో రోడ్డు పక్కకు తొలగించి ట్రాఫిక్‌ను క్లియర్‌ చేశారు. ఈ ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న ఇద్దరికి గాయాలయ్యాయి.

విత్తనాలు సకాలంలో విత్తుకోవడమే మేలు

- పెద్దవూర మండల వ్యవసాయాధికారి సందీప్‌కుమార్‌ సూచనలు



పెద్దవూర: పంటల సాగులో విత్తనాలు విత్తే సమయం అత్యంత కీలకం. వానాకాలం సీజన్‌ ఇప్పటికే ప్రారంభం కాగా.. ఈ సీజన్‌లో ఏఏ పంటలు సాగు చేసుకుంటే మంచిది, ఏ సమయంలో విత్తనాలు వేసుకోవాలి, ఎలాంటి విత్తనాలు వేసుకోవాలి అనే విషయాలపై పెద్దవూర మండల వ్యవసాయ అధికారి పి. సందీప్‌కుమార్‌ సలహాలు, సూచనలు..

పత్తి



ఆశించిన వర్షాలు కురిస్తే జూలై 15వ తేదీ వరకు పత్తి విత్తనాలను వేసుకోవచ్చు. ఆ తర్వాత విత్తుకుంటే దిగుబడిపై ప్రభావం పడుతుంది. పంట మార్పిడి విధానాన్ని పాటించాలి. పెసర, కంది అంతర పంటలుగా వేసుకుంటే మంచిది. ప్రభుత్వం అనుమతి ఇచ్చిన సుమారు 20 సంస్థలకు చెందిన బీటీ-2 పత్తి విత్తనాన్ని మాత్రమే విత్తుకోవాలి. ఎకరానికి సాగు భూమిని బట్టి 8 నుంచి 15 క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తుంది. జనవరిలో రెండో పంటగా మొక్కజొన్న, పెసర, కూరగాయలు పంటలను సాగు చేసుకుంటే మంచిది. పంట కాలాన్ని మార్చి వరకు ఎట్టి పరిస్థితుల్లో పొడిగించవద్దు.

కంది



కంది, మినుము, పెసర పంటలను జూలై 15వ తేదీ వరకు విత్తుకోవాలి. కందిని పత్తి, మొక్కజొన్న పంటల్లో కూడా అంతర పంటగా సాగు చేసుకోవచ్చు. ప్రధానంగా కందిలో రుద్రేశ్వర రకం పంటకాలం 160 నుంచి 180 రోజులు కాగా.. ఎకరానికి 7-8 క్వింటాళ్ల దిగుబడి వస్తుంది. డబ్ల్యూఆర్‌జీ 97 కంది రకం పంటకాలం 150-160 రోజులు కాగా ఎకరానికి 6-8 క్వింటాళ్ల దిగుబడి వస్తుంది.

వరి



వరి సాగు చేసే రైతులు దీర్ఘకాలిక రకాలను ఇప్పటికే నార్లు పోసుకోవాలి. మధ్యకాలిక రకాలు జూలై 10వ తేదీ వరకు నార్లు పోసేందుకు సమయం ఉంది. జూలై 31 వరకు స్వల్పకాలిక రకాలను నార్లు పోసుకునేందుకు అనుకూలం. ఆగస్టు 15 వరకు అన్నిరకాల వరి నాట్లు పూర్తి చేయాలి. సాగుకు ముందు పొలంలో పచ్చిరొట్ట పంటలైన జీలుగ, జనుము, పెసర విత్తనాలను సాగు చేసి పూతదశలో పొలంలో కలియదున్నితే భూసారం పెరిగి పంటకు మేలు జరుగుతుంది. ఎరువుల ఖర్చు తగ్గుతుంది. నార్లు పోసే సమయంలో తప్పకుండా వరి విత్తనాన్ని శుద్ధి చేయాలి.

- **దీర్ఘకాలిక సన్నరకాలు:** సిద్ధి రకం పంటకాలం 140 రోజులు కాగా దిగుబడి ఎకరాకు 30 క్వింటాళ్లు వస్తుంది. వరంగల్‌ సాంబ పంటకాలం 140 రోజులు కాగా ఎకరానికి 30 క్వింటాళ్ల దిగుబడి, వరంగల్‌ సన్నాలు పంటకాలం 135 రోజులు కాగా దిగుబడి ఎకరాకు 30 క్వింటాళ్లు, తెలంగాణ సోన రకం పంట కాలం 125-130 రోజులు కాగా ఎకరాకు 28 క్వింటాళ్ల దిగుబడి వస్తుంది. సాంబ మసూరి పంటకాలం 150 రోజులు కాగా ఎకరానికి 28 క్వింటాళ్ల దిగుబడి వస్తుంది. జైశ్రీరాం రకం పంటకాలం 135-140 రోజులు కాగా ఎకరాకు 24 క్వింటాళ్ల దిగుబడి వస్తుంది.
- **దొడ్డు రకం:** కూనారం సన్నాలు, బతుకమ్మ, కాటన్‌ దొర రకాల పంటకాలం 120 రోజులు కాగా.. ఎకరానికి 30 క్వింటాళ్ల దిగుబడి వస్తుంది. జగిత్యాల రైస్‌-1 రకం పంట కాలం 125 రోజులు కాగా ఎకరానికి 32 క్వింటాళ్ల దిగుబడి వచ్చే అవకాశం ఉంది.

మిరప



మిరప పంటను జూలై 15వ తేదీ వరకు నారు పోసుకుని నాటుకోవచ్చు. నేరుగా సాలు పద్ధతిలోనూ మిరప విత్తనాలను నాటవచ్చు. మిర పంటకాలం 180 రోజులకు కోతకు వస్తుంది. మార్కెట్‌లో లభించే అధిక దిగుబడిని ఇచ్చే హైబ్రీడ్‌ రకాలను ఎంపిక చేసుకోవాలి.

మొక్కజొన్న



మొక్కజొన్న పంటను జూలై 15 వరకు సాగు చేసుకోవచ్చు. మార్కెట్‌లో లభించే హైబ్రీడ్‌ రకాలు సాగు చేసుకోవచ్చు. భూమికి అనుకూలమైనవి ఎంపిక చేసుకోవాలి. మొక్కజొన్నను ఏక పంటగా కాకుండా కందితో కలిపి అంతర పంటగా వేసుకుంటే మంచిది.